# కూలీలకు పని కల్పించాలి

- డీఆర్‌డీవో పీడీ శ్రీలత
- ఉపాధి హామీ పథకంపై 16వ సామాజిక తనిఖీ




ఉపాధి హామీ సామాజిక తనిఖీ సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీలత

ఇబ్రహీంపట్నం రూరల్, జూన్ 1 : ఉపాధి హామీ కూలీలకు పనిని కల్పించడంతోపాటు కూలిని సకాలంలో చెల్లించాలని డీఆర్‌డీవో పీడీ శ్రీలత అన్నారు. ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ 16వ విడత సమావేశాన్ని ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన వివిధ పనులపై ఆరా తీశారు. సక్రమంగా రికార్డులు నిర్వహించని పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, కొలతలు తీసి ఎంబీలు సరిగ్గా చేయని సాంకేతిక సహాయకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామపంచాయతీల్లోని రికార్డుల ను మూడు నెలలకొక్కసారి అప్‌డేట్ చేయాలని.. కొత్తగా పనుల్లో చేరిన వారికి వెంటనే జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో సుభాషిణి, ఏపీడీ సక్రియా నాయక్, క్వాలిటీ కంట్రోల్ అధికారిణి పద్మ, ఎంపీడీవో క్రాంతికిరణ్, ఏపీవో తిరుపతిచారి, సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సకాలంలో అందించాలి

మంచాల, జూన్ 1 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫాంను సకాలంలో అందించాలని రంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి శ్రీలత డ్వాక్రా సంఘాల మహిళలకు సూచించారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని ఆరుట్ల, మంచాల గ్రామాల్లో విద్యార్థుల యూనిఫాం కుడుతున్న మహిళా సంఘాల కుట్టుమిషన్ కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. విద్యార్థుల యూనిఫాంను కుట్టే పనిని మహిళా సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి ఉపాధి లభిస్తుందన్నారు. మండలంలో 3,112 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వారికి సరిపడా యూనిఫాంలను పాఠశాలలు ప్రారంభం లోపే అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, సీసీ జైపాల్‌రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# విత్తనాలను లైసెన్స్ డీలర్ల వద్దే కొనాలి

### వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

వికారాబాద్, జూన్ 1 : పత్తి విత్తనాలను అధీకృత లైసెన్స్ డీలర్ల వద్దే కొనాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ అన్నారు. శనివారం ఆయన మోమిన్‌పేట మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. డీలర్లు కచ్చితంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్కులు, స్టాకు బోర్డులను ఏ ర్పాటు చేయాలని.. రైతులు బిల్లులు ఇవ్వకుంటే విత్తనాలను కొనొద్దన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనం తరం మండల వ్యవసాయ శాఖ అధికారి జయశంకర్ మాట్లాడుతూ మండలంలో సరిపడా పత్తి విత్తనాల స్టాక్ ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మోమిన్‌పేట వ్యవసాయ విస్తరణాధికారి పెంటయ్య తదితరులున్నారు.



మోమిన్‌పేటలోని ఓ షాపులో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

# ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

### రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక




సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక చిత్రంలో పక్కన వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి

షాబాద్, జూన్ 1 : చేవెళ్ల లోక్‌సభ ఎన్నిక ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. శనివారం చేవెళ్ల మండలం, గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లోని కంట్రోల్ రూంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతిలతో కలిసి కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత ఏఆర్వోలు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. ఈ నెల 4న జరుగనున్న చేవెళ్ల లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎలాంటి వస్తువులు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఉన్నదన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఓ కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రోఅబ్జర్వర్ ఉంటారని, రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో జూన్ 4న ఉదయం స్ట్రాంగ్ రూములను ఓపెన్ చేస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 28 టేబుళ్లు, మిగతా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలైన చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరులకు 14 చొప్పున టేబుళ్లను ఏర్పా టు చేస్తున్నామని ఆయన వివరించారు. ఈవీఎంల ఓట్ల కౌంటింగ్ ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని, అబ్జర్వర్ సమక్షంలో ఐదు వీవీ ప్యాట్ల ను ర్యాండమ్‌గా ఎంపిక చేసి స్లిప్పులను లెక్కిస్తారని తెలిపారు. ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సిబ్బందిని, ఇతర సిబ్బందిని నియమించామన్నారు. ప్రతి రౌండ్ పూర్తి కాగానే ఎంకోర్ యాప్‌లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. తెలిపారు. ఈ సమీక్షలో ఏఆర్‌వోలు, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఐదోతేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

షాబాద్, జూన్ 1: రంగారెడ్డి జిల్లాలోని పెండ్లి కాని నిరుద్యోగ యువతీయువకులకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు(సంగీతకారుడు)కోసం రిజిస్ట్రేషన్ ఆధారిత రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నియామకం కోసం జాబ్ నోటిఫికేషన్ జారీ అయ్యిందని.. ర్యాలీకి సంబంధించిన రిజిస్ట్రేషన్ ఐదోతేదీతో ముగుస్తుందని http:// agnipathvayu.cdac.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తాత్కాలిక అడ్మిట్ కార్డులు జారి అయినా అభ్యర్థులు మాత్రమే రిక్రూట్ మెంట్ ర్యాలీలో పాల్గొనేందుకు అనుమతి ఉంటుందన్నారు.

# పునర్నిర్మాణానికి సమష్టి కృషి అవశ్యం



సమావేశలోంలో మాట్లాడుతున్న ప్రొ. హరగోపాల్ తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 1 : తెలంగాణ పునర్నిర్మాణానికి సమష్టిగా కృషిచేస్తే రాష్ట్రం మరింత అభివృద్ధిలో ముందుకెళ్లే అవకాశం ఉందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకుడు ప్రొ.జి.హరగోపాల్ అన్నారు. శనివారం రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టీఏఎస్‌ఏ), బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇప్పుడే పౌరుల గొంతుక ప్రభుత్వానికి వినిపించే అవకాశాలున్నాయన్నారు. విశ్వవిద్యాలయాలు చైతన్యవంతంగా ఉంటే పౌర సమాజం బాగుంటుందన్నారు. ప్రభుత్వాలు నిరంతరం ప్రజలతో చర్చలు కొనసాగిస్తుండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ రైతుల్లో అధిక శాతం సన్న చిన్న కారు రైతులున్నారని, వారి అభ్యున్నతిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే ఆలోచన ప్రభుత్వానికి ఉందని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. ఎం.కోదండరాం అన్నారు. దేశంలోనే అధిక శాతం విత్తన బంఢాగారం తెలంగాణకే సాధ్యమని, అందుకు అనుగుణంగా వనరులున్నాయని సూచించారు. విశ్వవిద్యాలయాలను స్వేచ్ఛగా కొనసాగిస్తేనే మంచి ఫలితాలు పొందగలమన్నారు. విశ్వవిద్యాలయాలు పురోగతి దశలో నడిపితేనే అమరవీరుల త్యాగాలకు అసలైన నివాళి అని పీజేటీఎస్‌ఏయూ రిజిస్ట్రార్ పి.రఘురామిరెడ్డి అభిప్రాయ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంకా టీఏఎస్‌ఏ అధ్యక్షుడు డా. విద్యాసాగర్ , బోధనేతర సిబ్బంది సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్ డా.వనమాల, ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె డా. జీవీ వెన్నెల పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, బోధనా బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాణించిన సుకన్య



హైదరాబాద్, ఆట ప్రతినిధి: అమెరికా వేదికగా జరిగిన వరల్డ్ వుమెన్ మాస్టర్స్ క్లాసిక్ బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన తేజావత్ సుకన్య ఆకట్టుకుంది. మొత్తం 60 దేశాల నుంచి మొత్తం 1200 మంది ప్లేయర్లు ఈ టోర్నీలో పాల్గొన్నారు. మహిళల 76 కిలోల విభాగంలో బరిలోకి దిగిన సుకన్య ఎనిమిదో స్థానంలో నిలిచి ఆకట్టుకుంది. జెనియా ఖాన్ (కజకిస్థాన్), అంగెస్ రుడిన్ (స్వీడన్), ఐరీ సకగుచి(జపాన్) వరుసగా టాప్-3లో నిలిచారు.

## యంగ్ అంత్రప్రెన్యూయర్లకు సీడీఎఫ్‌డీ ఆఫర్

- ఇంక్యుబేషన్ నోటిఫికేషన్ జారీ
- ఈ నెల 5తో ముగియనున్న గడువు

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): ఆంత్రప్రెన్యూయర్లుగా ఎదిగేందుకు అవసరమైన మార్గ నిర్దేశనం చేసేందుకు సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ ముందుకు వచ్చింది. సీడీఎఫ్‌డీ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా స్టార్టప్‌లకు అవసరమైన వర్క్ స్పేస్, మౌలిక వసతులు, గైడింగ్‌తో ప్రత్యేక అవకాశం కల్పించింది. జూన్ 5లోగా సీడీఎఫ్‌డీ ఇంక్యుబేషన్ సెంటర్‌లో నమోదు చేసుకుని స్టార్టప్‌లు ప్రారంభించుకోవచ్చని ప్రకటనలో తెలిపింది.



నృత్య ప్రదర్శనలతో అలరిస్తున్న కళాకారులు

## అలరించిన నృత్య ప్రదర్శనలు

మాదాపూర్, జూన్ 1: కళాకారులు నృత్య ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం నృత్య ప్రదర్శనలను నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత విష్ణు సహస్ర నామం, లక్ష్మీ అష్టోత్తరం, శ్రీ నందకాయ, అన్నమ్మ గాయత్రి, శ్రీ మద్వదీయ చరితాంమృత, అని అన్నమయ్య గురుస్తుతితో ప్రారంభించారు. అనంతరం కళాకృతిస్ గురువు ఎస్ సుజరిత, ఎస్ సుప్రజ వారి శిష్య బృందం సాయి కీర్తి, రిషిత, లిప్సిక, ఐశ్వర్య, ప్రవస్థి, అభినయ సంయుక్త ఆధ్వర్యంలో పలు ప్రఖ్యాత సంకీర్తనలకు నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం, కళాకారులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతిని ఇచ్చి ప్రసాద వితరణ చేశారు.

## ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శనలు

కొండాపూర్, జూన్ 1: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం పలువురు కళాకారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 'మానస స్కూల్ ఆఫ్ డ్యాన్స్' గురువు ప్రణవి తుమ్మాటి తన శిష్య బృందంతో కలిసి ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రత్యేకంగా అలరించాయి. ప్రదర్శనల్లో అంబ పరాకు, వినాయ కౌతం, మూషిక వాహన, మీనాక్షి పంచ రత్న, ముద్దుగారే యశోద, విన్నపాలు వినవలె, పలుకే బంగారమాయేనా, మరకత మణిమయ, ఇదిగో భద్రాద్రి, గరుడ గమన, బిందుమాలిని తిల్లాన అంశాలను కళాకారులు ప్రదర్శించిన తీరు ఆద్యంతం ఆకట్టుకుంది.



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

## ప్రమాద బీమా ..

# కార్మికుడికి ధీమా

### భవన నిర్మాణ కార్మికులకు భరోసా ఇస్తున్న ప్రభుత్వ పథకాలు



మొయినాబాద్, జూన్ 1 : భవనాన్ని నిర్మించాలంటే సుమారుగా పదిరంగాల కార్మికులు పని చేస్తుంటారు. ఇల్లు, భవనాల నిర్మాణం జరిగినప్పుడు ప్రమాదాల బారిన పడి కార్మికులు మృతి చెందడం, గాయపడడం వంటివి జరుగుతుంటాయి. అలాంటి సమయంలో కార్మికులకు భరోసా ఇస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను ప్రవేశపెట్టి చేయూతను ఇస్తున్నాయి. ప్రమాద బీమా కల్పిస్తూ కార్మికులకు ధీమా అందిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో కార్మికులను ఆదుకునేందుకు ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలిని ఏర్పాటు చేశారు.

**దరఖాస్తు ఇలా..**

ఈ పథకంలో లబ్ధి పొందే కార్మికులు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్‌తోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మీ-సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం మీ-సేవలో ఇచ్చిన రసీదు, కార్మిక సంఘం గుర్తింపు కార్డుతో కార్మిక శాఖ కార్యాలయంలో అందజేయాలి. అక్కడి అధికారులు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తెలంగాణ కార్మిక శాఖ లేబర్ కార్డును మీ సేవ ద్వారా అందిస్తారు.

**అర్హులు ఎవరంటే..**

కార్పెంటర్లు, పెయింటర్లు, ప్లంబర్లు, ఐరన్‌వర్కర్లు, మేస్త్రీలకు సహాయం చేసే వారు ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన కార్మిక సంఘాల్లో సభ్యత్వం పొంది ఉండాలి. 18-60 ఏండ్ల లోపు వారు అర్హులు. తెలంగాణ కార్మిక మండలిలో మొదటిసారి సభ్యత్వం పొందేందుకు మీ-సేవా సెంటర్‌లో రూ.110 చెల్లించి నమోదు చేసుకోవాలి. ఒక్కసారి సభ్యత్వం పొందితే 5 ఏండ్ల వరకు కొనసాగుతుంది. అనంతరం రూ.60 చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలి.

**కార్మికులకు చేకూరే లబ్ధి..**

కార్మికులు ప్రమాదంలో చనిపోతే రూ.6 లక్షలకు పైగా సాయం అందుతుంది. సాధారణ మరణం పొందితే రూ.లక్షకు పైగా కుటుంబానికి ఇస్తారు. కార్మికుడు మృతి చెందితే వారి పిల్లల వివాహాలు, ప్రసూతికోసం రూ.30 వేల వరకు ఇస్తారు. వాటితోపాటు పలు రకాల పథకా లు కార్మికుల కుటుంబాలకు అందిస్తూ ప్రభుత్వం కార్మి కులకు భరోసా కల్పిస్తుంది.

**ఈ-శ్రమ్ పోర్టల్..**

అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం రెండేండ్ల కిందట ఈ-శ్రమ్ అనే పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఇందులో పేర్లు నమోదు చేసుకున్న కార్మికులకు సామాజిక భద్రతతోపాటు వివిధ సంక్షేమ పథకాలు అందుతాయి. ప్రతి అసంఘటిత రంగ కార్మికుడికి 12 అంకెల గుర్తింపు కార్డును అందజేస్తారు. ఈ కార్డు ఉం టేనే కేంద్ర ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు, వివిధ సంక్షేమ పథకాలు వర్తిస్తాయి.

## లంకె బిందెలు ఆశచూపి..

# రూ.2లక్షలతో ఉడాయించారు



యాచారం పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురు నిందితులు

### చాకచక్యంగా వ్యవహరించి దుండగులను పోలీసులకు పట్టించిన బాధితురాలు

యాచారం, జూన్ 1 : లంకె బిందెలను ఆశ చూపి ముగ్గురు దుండగులు ఓ మహిళను మోసం చేసి.. రూ.రెండు లక్షలతో ఉడాయించారు. ఆమె చాకచక్యంగా వ్యవహరించి వారిని పోలీసులకు పట్టించింది. ఈ ఘటన మండలంలోని గున్‌గల్ గ్రామంలో జరిగింది. బాధితురాలు, సీఐ శంకర్‌కుమార్ కథనం ప్రకారం.. గున్‌గల్ గ్రామానికి చెందిన ఓ మహిళ మార్చి 27న కుటుంబంతో కలిసి శ్రీశైలం వెళ్లింది. అక్కడ స్వామి వారి దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా నాగర్‌కర్నూల్ జిల్లా మున్ననూరు వద్ద మూలికలు అమ్ముకుంటున్న మహేశ్, మల్లికార్జున్, శివశంకర్‌లను కలిసింది. తన ఆరోగ్యం బాగా ఉండడంలేదని నయం చేయాలని వారిని కోరింది. దీంతో ఆ ముగ్గురు వనమూలికలు, మంత్ర శక్తులతో ఆరోగ్యాన్ని బాగు చేస్తామని నమ్మించారు. మార్చి 30న ఆ ముగ్గురు గున్‌గల్ గ్రామానికి వచ్చి ఆ మహిళ ఇంట్లో పూజలు చేశారు. ఇక్కడ లంకె బిందెలున్నాయని చెప్పి పూజను మధ్యనే ఆపేశారు. వాటిని బయటికి తీయాలంటే రూ.మూడు లక్షల వరకు ఖర్చుఅవుతుందని..వాటితో మీరు కోటీశ్వరులు అవుతారని నమ్మబలికి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ మహిళకు సైతం లంకె బిందెలపై ఆశ పెరుగడంతో వారిని మళ్లీ సంప్రదించి.. వాటిని తీసేందుకు రూ.2 లక్షలకు బేరం కుదుర్చుకున్నది. దీంతో దుండగులు మే 24వ తేదీన ఆమె ఇంటికొచ్చి పూజలు చేశారు. ఆమెను బయట ఉంచి తలుపులు వేశారు. వారే ఒక గుంతను తీసి అందులో లంకె (రాగి) బిందెను ఉంచారు. అందులో ఓ వెండి విగ్రహం, చేతికంకణం, చిన్న, చిన్న ఇత్తడి పాత్రలను ఉంచారు. వాటిని ఆ ఇంటి గుంతలో నుంచి తీసినట్లు నమ్మించారు. గుంత వద్ద గుమ్మడికాయలు, కొబ్బరికాయలు కొట్టి పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో క్షుద్రపూజలు చేశారు. ఆ వస్తువులను సంచిలో ఉంచి పూజ గదిలో పెట్టారు. దానిని 11 రోజుల తర్వాత తెరువాలని, ప్రతిరోజు పూజ చేయాలని సూచించి.. రూ.1.80 లక్షలు తీసుకొని అక్కడి నుంచి ఉడాయించారు. ఆ మహిళ 11 రోజులు కాకుండా మూడు రోజులకే ఆ సంచిని ఓపెన్ చూసి చూడగా అందులో ఓ రాగి బిందె, చిన్న వెండి విగ్రహం, చేతికంకణం, చిన్న, చిన్న రాగి పాత్రలే ఉండటంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యింది. ఆశకు పోగా దురాశ ఎదురైందని దుఃఖించింది. దుండగులు మోసం చేశారని బాధపడింది. వారిని పోలీసులకు పట్టించాలని భావించింది. అందుకోసం మళ్లీ దుండగులకు ఫోన్ చేసి మా చెల్లెలి ఆరోగ్యం బాగాలేదని ..మీరు వచ్చి చూడాలని కోరింది. దానికి డబ్బులు ఖర్చుఅవుతాయని చెప్పగా.. వారితో రూ.40,000లకు బేరం కుదుర్చుకుని.. అడ్వాన్స్‌గా రూ.10,000 ఫోన్‌పే ద్వారా పంపింది. దీంతో డబ్బులు వస్తాయనే ఆశతో దుండగులు మే 31న ఇంటికి రాగా.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి దుండగులను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసులు విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించారు. మహిళ నుంచి మొదట రూ.1.80 లక్షలు, తర్వాత రూ.10,000 తీసుకున్నట్లు ఒప్పుకున్నారు. బాధితురాలు మాత్రం అన్ని ఖర్చులతో కలిపి వారికి రూ.3లక్షలు ఇచ్చినట్లు తెలిపింది. తమ డబ్బును ఇప్పించి న్యాయం చేయాలని పోలీసులను కోరింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.